క్లుప్తంగా

తల్లులకు వంటల పోటీలు



పెనమలూరు: వణుకూరు అంగన్‌వాడీ–4లో బుధవారం తల్లులు, గర్భిణులకు వంటల పోటీలు నిర్వహించారు. గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణమాసం 2025ను నిర్వహించారు. ఈ కార్యక్రమం కింద నెలరోజుల పాటు తల్లులు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. ఇందులో భాగంగా వంటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆకుకూరల పకోడి, రాగిపిండి లడ్డు, ఆకు కూరల చపాతి తయారీ పోటీలను నిర్వహించారు. రుచికరంగా వండిన సీహెచ్.తిరుమల్లేశ్వరి, టి.ప్రవల్లిక, షేక్ బషీరా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కామేశ్వరిదేవి, గర్భవతులు, తల్లు, బాలింతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు రోబో ఎక్స్ 2కే25 సదస్సు



పెనమలూరు: కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం రోబో ఎక్స్ 2కే25 సదస్సు నిర్వహిస్తున్నామని ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో గురు, శుక్ర వారాల్లో విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయిలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో 24 గంటలు హ్యాకథాన్ రోబో ఎక్స్ 2కే25 ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్, రోబోటిక్స్ టెక్నాలజీ, ఇన్నోవేటింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఆటోమేషన్‌పై వర్క్‌షాప్ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వాల్టీనో సిస్టమ్ ఎండీ డాక్టర్ కృష్ణదొర పాల్గొంటారని తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ



కంకిపాడు: విద్యార్థుల ఉన్నతికి చేయూత అవసరమని లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు అధ్యక్షుడు మద్దుల యుగంధర్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. యుగంధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. విద్యాభివృద్ధికి తమ వంతు చేయూత అందించాలని కోరారు. వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మద్దుల గోవిందరావు, ఉమామహేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వావిలాల సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాలకృష్ణయ్య దేశానికి అందించిన సేవలు అపూర్వమని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి అన్నారు. వావిలాల జయంతి వేడుకలను సర్వోదయ మండలి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ విలువలు కలిగిన రాజకీయనేత వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా పోరాడటంతో పాటు, స్వాతంత్ర్యం వచ్చాక సమాజంలో మద్యపానానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన మహనీయుడని అన్నారు. అనేక ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించిన వావిలాల గోపాలకృష్ణయ్య ఎందరికో స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి వితరణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడులోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన అయ్యప్ప స్వామి ఆలయానికి ఆర్యవైశ్య ప్రముఖుడు కొనకళ్ల రాజశేఖర్, ధనలక్ష్మి దంపతులు రూ.70,516 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని హనుమాన్‌జంక్షన్‌లోని వారి నివాసంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తుమ్మల నారాయణరావు, తమిరి రమేష్‌లకు బుధవారం అందించారు. అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన వృద్ధ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

ఆదమరిస్తే.. గల్లంతే!



ప్రమాదకరంగా ఉన్న లాకు వంతెన ప్రాంతం



ధ్వంసమైన లాకుల వద్ద రోడ్డు మార్జిన్

- ధ్వంసమైన రోడ్డు మార్జిన్‌లు
- ప్రమాదకరంగా కల్వర్టు రక్షణ గోడలు
- పట్టించుకోని పాలకులు
- భయం భయంగా రాకపోకలు సాగిస్తున్న ప్రజానీకం

కంకిపాడు: నిత్యం వేలాది మంది ప్రజానీకం రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు సంచరిస్తుంటాయి. రోడ్డు మార్జిన్‌లు కోతకు గురై ధ్వంసమై ప్రమాదభరితంగా మారటంతో రాకపోకలకు ప్రజలు భయాందోళనలు చెందుతున్న దుస్థితి. కల్వర్టు రక్షణ గోడలు సైతం ధ్వంసమై పొంచి ఉన్న ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదు. దీంతో భయం అంచున ప్రయాణం సాగించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. కంకిపాడు లాకు సెక్షన్ వద్ద పరిస్థితి ఇది.



వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా మారిన లాకులు

ప్రధాన లాకులు.. అయినా పట్టించుకోరు

బందరు కాలువపై ఉన్న ప్రధాన లాకుల్లో కంకిపాడు లాకు సెక్షన్ ఒకటి. బందరు, పుల్లేరు, వంతెన కాలువ, వల్లూరు పడమట కాలువలతో పాటుగా అనేక పంట కాలువలు, బోదెలకు లాకుల వద్ద నుంచి నీటి సరఫరా జరుగుతుంది. సుమారు 35 వేల ఎకరాలకు ఈ లాకుల ద్వారా సాగునీటి సరఫరా అవుతుంది. ప్రధాన లాకుల్లో ఇది ఒకటి. అలాంటి లాకు ప్రాంతంలో ప్రమాదం పొంచి ఉంది. నీటిని మళ్లించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన లాకుల మీదుగా రహదారి మార్గాన్ని నిర్మించారు. కాలువలు ఉన్న ప్రదేశాల్లో రక్షణకు అనువుగా కల్వర్టులు నిర్మాణం చేశారు.

ధ్వంసం అయిన కల్వర్టులు

కాల క్రమంలో వాహనాల రాకపోకలతో కల్వర్టులు ధ్వంసం అయ్యాయి. రక్షణ గోడలు పగుళ్లు వారాయి. రోడ్డు మార్జిన్‌లు కోతకు గురై పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. వాహనాలు అదుపుతప్పితే పక్కనే ఉన్న కాలువలోకి పడిపోవటమే. లాకుల పరిసరాలు పూర్తిగా ప్రమాదభరితంగా మారటంతో వాహనదారులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగించాలంటేనే భీతిల్లిపోతున్నారు. దీనికి తోడు లాకుల వద్ద మేట వేసుకుపోతున్న వ్యర్థాల కారణంగా దుర్గంధం వెలువడుతోంది. ప్రజల ఆరోగ్యానికి సైతం ప్రమాదం పొంచి ఉందని భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

పట్టించుకోని పాలకులు

ప్రమాదం పొంచి ఉన్నా లాకుల ప్రాంత అభివృద్ధిపై పాలకులు దృష్టిసారించటం లేదు. ప్రమాదకరంగా ఉన్న పరిసరాలను అభివృద్ధి చేసేందుకు శ్రద్ధ చూపటం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నతాధికారులకు వివరించాం

ధ్వంసమైన కల్వర్టులు, వాటి పరిస్థితుల గురించి ఉన్నతాధికారులకు వివరించాం. ఆధునికీకరణ కింద లాకుల అభివృద్ధికి అంచనాలు పంపాము. నిధులు మంజూరైతే వాటిని వినియోగించి లాకులు, వాటి పరిసరాలను పూర్తి స్థాయిలో ఆధునికీకరించేందుకు అవకాశం ఉంటుంది.

– నాగబాబు, ఏఈ, కంకిపాడు లాకులు

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం: వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోరుతూ దశల వారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరత్నం తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం మండల గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18, 19 తేదీల్లో అన్ని మండల తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 20న రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా, 22న జిల్లా కలెక్టర్ల కార్యాలయాలు వద్ద ధర్నాకు రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందన్నారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో వీఆర్‌ఏలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దారు కె.వెంకట శివయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘ మండల అధ్యక్షుడు ఎం.పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జోస్పిన్, కోశాధికారి డి.అనూష, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘ నేతలు

ఘనంగా విశ్వకర్మ జయంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



గన్నవరంలో పతాకావిష్కరణలో సంఘ నేతలు

పెనమలూరు: పోరంకి శ్రీ వసంతవేణుగోపాల స్వామివారి ఆలయంలో బుధవారం విశ్వకర్మ జయంతి ఘనంగా చేశారు. సంఘ సభ్యులు హోమం చేసి, పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్ మాట్లాడుతూ విశ్వకర్మ సంఘీయులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రుద్రభూమి స్థలం కేటాయింపు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ పతాకాన్ని సీనియర్ సంఘ నాయకులు పుట్టా సర్వేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. విశ్వబ్రాహ్మణ కార్మికులు విశ్వకర్మను కొలిచి తమ వృత్తి పని ముట్లను, పరికరాలను విశ్వకర్మ చిత్రపటం వద్ద ఉంచి పూజించారు. ప్రపంచ సృష్టిలో మొదటి వాస్తుశిల్పి విశ్వకర్మ సకల కళలకు ఆద్యుడిగా సంఘ నాయకులు అభివర్ణించారు. విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆందోళన

గన్నవరం: ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద ప్రకటించిన రూ. 15 వేలను పెంచి లైసెన్స్ ఉన్న ప్రతి కార్మికుడికి రూ.25 వేల చొప్పున ఇవ్వాలని ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పోలినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ నేతృత్వంలో ఆటో వర్కర్స్ ర్యాలీగా తరలివచ్చి స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. వీరిని ఆదుకునేందుకు లైసెన్స్ ఉన్న కార్మికులందరికీ వాహనమిత్ర పథకం వర్తింపజేయాలని కోరారు. ఆటో డ్రైవర్లకు రాయితీపై పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన మోటార్ సవరణ చట్టం జీఓ నంబర్ 21 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, మోటార్ కార్మికుల వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. లైసెన్స్ మంజూరులో నిబంధనలను సడలించి పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు నాని, సీఐటీయూ నేతలు కె.వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

పటమట(విజయవాడతూర్పు): బాలుడు అదృశ్యంపై పటమట పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. కరెన్సీనగర్ వద్ద ఉన్న రామచంద్రనగర్‌లో నివాసం ఉంటున్న తురక అంజమ్మ రోజువారీ పనులకు వెళ్తుంది. భర్తతో వచ్చిన మనస్పర్థలతో తన ఇద్దరు కూతుళ్లు, కొడుకుతో కలిసి 10 ఏళ్లుగా జీవిస్తుంది. అంజమ్మ కొడుకు తురక విజయ్‌కుమార(14) రామవరప్పాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. 10 రోజులుగా తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవటంతో ఇంటివద్దే ఉంటున్నాడని, రోజు మాదిరే బుధవారం కూడా తన పని ముగించుకుని ఇంటికి రాగా తన కుమారుడు కన్పించకుండా పోయాడని పటమట పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: సురక్షిత తాగునీటి సరఫరాకై అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రసాదంపాడు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను బుధవారం పారిశుద్ధ్య సిబ్బందిచే శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వాటర్ ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేయించినట్లు వివరించారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన వాటర్ పైప్‌లైన్‌లను గుర్తించి మరమ్మతులు చేయించామన్నారు. కాల్వగట్టు ప్రాంతంలో మోటారు బోర్ల సహాయంతో తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల తాగునీటి నమూనాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సేకరించినట్లు వివరించారు. తాగునీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నమైతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.


దేవస్థానం పాలక మండలి నియామకం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా వేమూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు నూతన పాలక మండలి సభ్యులను నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ పాలకమండలి చైర్మన్‌గా అప్పనవీడు గ్రామానికి చెందిన టీడీపీ నేత వేమూరి శ్రీనివాసరావును నియమించారు. సభ్యులుగా ఎం.గోపీచంద్, పి.లక్ష్మీ ప్రియ, ఎం.రమేష్, డి.అశోక్‌కుమార్, కె.రామచంద్రయ్య, వి.ఉషారాణి, కె.లక్ష్మీదుర్గ, ఎ.సునీత, బి.మల్లేశ్వరి, పి.శ్రావణిలను నియమించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు పాలకమండలి ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం ఈ నెల 27వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నలుగురికి జైలు శిక్ష

కృష్ణలంక(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురికి న్యాయస్థానం వారం రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై మూడో ట్రాఫిక్ పోలీసులు బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని 7వ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కమ్ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆర్.వి.ఎస్ శర్మ ఒక్కొక్కరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారని చెప్పారు.

అంతరిక్ష యానం వైపు లయోలా పూర్వ విద్యార్థి



లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతరిక్షంలో జీవితాన్ని గడపడానికి ముందుకు సాగుతున్న ఆంధ్రా లయోలా కళాశాల పూర్వ విద్యార్థిని ఆనీ సత్తెనపల్లి మనందరికీ గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆనీ అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ మాట్లాడుతూ ఖగోళ భౌతికశాస్త్ర పరిశోధనలో, విదేశాల్లో ఖగోళ జీవశాస్త్రంలో అధ్యయనాల వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఐఐటీ ఇండోర్ నుంచి మాస్టర్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆనీ ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వ విద్యాలయంతో కలిసి యూజీమార్ట్, ఎండబ్ల్యూఏ వంటి అత్యాధునిక టెలిస్కోప్‌లను ఉపయోగించి పల్సర్‌లపై విస్తృతంగా పని చేశారన్నారు. ఆమె పరిశోధన ఇప్పుడు యూకేలోని ఎడిన్‌బర్గ్ విశ్వ విద్యాలయంలో ఆస్ట్రోబయాలజీ వైపు ఉత్తేజకరమైన మలుపు తీసుకున్నట్లు తెలిపారు. అక్కడ ఆమె భూమికి ఆవల జీవం ఉండే అవకాశాలను అన్వేషించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఏపీటీ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ జి.సహాయ భాస్కరన్, డాక్టర్ పీవీఎస్ సాయిరాం, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఫాదర్ వైటి ప్రభులు సత్తెనపల్లి ఆనీ సాధించిన విజయాలను ప్రశంసించారు.

వ్యాధులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



కోలవెన్నులో సూచనలు ఇస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కంకిపాడు: అసంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అంజు అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజు మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులపై మహిళలకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామన్నారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, క్షయ వంటి వ్యాధులకు స్క్రీనింగ్‌తో పాటుగా కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, మానసిక వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చోరగుడి సురేష్, ఉపసర్పంచ్ కంచర్ల చిన్ని, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తుమ్మల జగదీష్, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, హెల్త్‌సూపర్‌వైజర్ శారమ్మ, సుధాకర్, హెల్త్‌అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, సీహెచ్‌ఓ సరళ, ఏఎన్‌ఎం మార్తమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యం మెరుగుపర్చేందుకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయ సూచించారు. బుధవారం నున్న గ్రామ సచివాలయం–1 వద్ద స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు యర్కారెడ్డి కోటిరెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: యనమలకుదురు అర్బన హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబంలో భాగంగా మహిళలకు పలు రకాల వైద్య సేవలు అందిస్తారు. వైద్యులు డాక్టర్ కె.వజ్రకుమర్, డాక్టర్ హారిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభయాన్ కార్యక్రమంలో బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక తారకరామ కాలనీలోని ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీనివాస్ వైద్య సేవలు అందించారు. దాదాపు 100 మంది మహిళలు, బాలికలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పలువురు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపాలి



పోరంకిలో నిరసన ర్యాలీలో ఇండియా కూటమి నాయకులు

పెనమలూరు: దేశంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరపాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. ఓట్ చోర్– గద్దేచోడ్ కార్యక్రమంలో భాగంగా ఇండియా కూటమి నేతలు బుధవారం తాడిగడప జంక్షన్ నుంచి పోరంకి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం బీజేపీ తొత్తుగా మారిందని ఆరోపించారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నయని విమర్శించారు. ఏఐసీసీ సభ్యుడు ధనేకుల మురళీమోహన్‌రావు మాట్లాతూ దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా మోసపూరితంగా జరుగుతున్నాయన్నారు. దొంగ ఓట్లు, ఈవీఎం మెషన్‌లతో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తోందన్నారు. బీజేపీ కబంధ హస్తాల నుంచి దేశాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి నేతలు నరహరశెట్టి నరసింహారావు, వెలిశిల సుబ్రహ్మణ్యం, కొసనం రాము, పంచకర్లరంగారావు, మున్నంగి నరసింహారావు, షేక్ చాన్‌బాషా, తమలం ఝాన్సీరాణి, తోట రాధిక మాధవి, కిలారు వెంకటరత్నం, ఇండియా నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాంకేతిక సహకారంతో ప్రగతి సాధ్యం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గన్నవరం రూరల్: చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ప్రభుత్వం అందించే సాంకేతిక సహకారంతో ప్రగతి సాధ్యమని ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడలో బుధవారం ఎలీప్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 53 మంది బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్‌లకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక వేత్తలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు శిక్షణలు ఉపయోగపడతాయని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ లేడి ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఎలీప్) అధ్యక్షురాలు కె.రమాదేవి మాట్లాడుతూ ర్యాంప్ పథకం ద్వారా ఎలీప్ మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తూ పథకం లక్ష్యాలను నెరవేరుస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు, ఎలీప్ చైర్‌పర్సన్ కనకదుర్గ, జ్యోతిరావు, సునీత, బాలాజీ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో డస్ట్‌బిన్ల పంపిణీ



రైతుబజార్‌లో డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న మానవత ప్రతినిధులు

గన్నవరం: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గన్నవరం శాఖ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక రైతుబజార్‌లో పారిశుద్ధ్య నిర్వాహణ నిమిత్తం మానవత సంస్థ ద్వారా 40 డస్ట్‌బిన్లను, రెండు ట్రాలీలను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉంగుటూరుకు చెందిన సన్యాసి నాయుడుకు రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మడుపల్లి మాట్లాడుతూ.. నిత్యం వేలాది మంది ప్రజలు వచ్చే రైతుబజార్ పరిశుభ్రత కోసం మాగంటి శ్రీనివాసరావు సౌజన్యంతో డస్ట్‌బిన్లను అందజేసినట్లు చెప్పారు. సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వీవీ.కృష్ణమోహన్, కోశాధికారి పొట్లూరి రామకృష్ణారావు, డైరెక్టర్లు గన్నె వెంకట్రావు, ముక్కామల సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు):బీహార్ రాజధాని పాట్నాలో ఇటీవల జరిగిన 9వ లేజర్ రన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ చెప్పారు. పతకాలు పొందిన విద్యార్థులను గాంధీనగర్‌లోని శారద ఇంగ్లిషు మీడియం స్కూల్ ఆవరణలో బుధవారం అభినందించారు. రామనారాయణ మాట్లాడుతూ ఈ నెల మొదటి వారంలో బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన 9వ లేజర్ రన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో విద్యార్థి షేక్ అలియా జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని, పల్నాడులో జరిగిన 8వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల మోడరన్ పెంతాట్ లాన్ లేజర్ రన్ చాంపియన్ షిప్‌లో రెండవ స్థానాన్ని సాధించిందన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రీజియన్ స్థాయిలో జరిగిన మోడరన్ పెంతాట్ లాన్ లేజర్ రన్ పోటిల్లో డీ.కార్తీక్ రోషన్, డి.నాథన్ మూడో స్థానంలో నిలిచారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మూరిఅభినందించారు.